ఆ మాటల అర్థం చెప్పమని అతను కోరితే వారు బదులు మాట్లాడలేదు.

అతను కాశీకి చేరుకున్నాక ఓ తాత్వికుడికి తను విన్నది చెప్పి, ఆ మాటల అర్థం వివరించమని కోరాడు. దాన్ని అతను ఇలా వివరించాడు.

"కొంత రుణం తీర్చడం అంటే, పెంచి పెద్ద చేసిన తల్లితండ్రుల పోషణకి, వైద్యానికి ఖర్చు చేసి వారి రుణం తీర్చుకోవడం. రుణం ఇవ్వడం అంటే, తనని వృద్ధాప్యంలో ఆదుకునే తన పిల్లలకి విద్యాబుద్ధులు నేర్పించడానికి ఖర్చు చేయడం. కొంత దాచుకోవడం అంటే, ముందు జన్మలకి ఉపయోగపడేలా దానధర్మాలు చేయడం. ఇక చివరగా కొంత మురుక్కాలవలో పారేయడమంటే, తన శరీర పోషణకి, భోజనానికి, బట్టలకి ఖర్చు చేయడం. ఈ మూడిటికి కాక ఇంక దేనికి ఖర్చు చేసినా మనిషి డబ్బుని వృధా చేసినట్లే."

## 4. అల్లుడు

ఓ గురువు ఓ నది ఒడ్డున కూర్చుని చిరిగిన తన కౌపీనాన్ని కుట్టుకుంటూంటే, అటుగా వచ్చిన ఆ దేశరాజు ఆయన్ని చూసి భక్తిగా చెప్పాడు.

"స్వామీ! మీకిదేం ఖర్మ? మా నగరానికొస్తే మీకేం కావాలంటే అది సమకూర్చుతాను."

వెంటనే గురువు తను కుట్టే సూదిని నదిలోకి విసిరేసి చెప్పాడు.

"అంత దూరం వద్దులే కాని, నదిలో పడ్డ నా సూదిని తీసివ్వు చాలు."

"వేగంగా ప్రవహించే నదిలో పడ్డాక అది ఇంకెక్కడ దొరుకుతుంది. మా నగరం నించి మీకు బంగారు సూదులు వెంటనే తెప్పించి ఇవ్వనా?"

చిన్నగా నవ్వి చెప్పాడు గురువు.

"నువ్వు ఎంత అల్పుడివో తెలుసుకో రాజా. నీ యావత్తు పరాక్రమం, సంపద, శక్తియుక్తులు నదిలో పడ్డ చిన్న సూది ముందు పని చేయలేదు."

దాంతో రాజుకున్న గర్వం అణిగిపోయింది. అతను ఆయన్ని గురువుగా స్వీకరించి, ఆయన దగ్గర మంత్రోపదేశం పొంది త్వరలోనే మిగిలిన అహాన్ని కూడా వదిలించుకో గలిగాడు.

## 5. కప్పెక్కిన గుఱ్ఱం

ఓ సంచార గురువు బోధనలు విన్నాక ఓ రాజుకి ఆత్మ సాక్షాత్కారం మీద ఆసక్తి కలిగింది. అతను బంగారు శివుడి విగ్రహం చేయించి, తన అంతఃపురంలో వుంచి నిత్యం దానికి పంచామృతంతో అభిషేకం చేయసాగాడు. అయితే ఇంతకుమించి ఆ రాజు జీవన స్థాయిలో మాత్రం ఎలాంటి మార్పు లేదు.

ఓ రాత్రి రాజు పుష్పాలతో అలంకరించిన శయ్యమీద పడుకోబోతూ, కిందనించి ఎవరో పిలిచినట్లు అనిపించి కిటికీ దగ్గరకి వెళ్ళి కిందికి చూసాడు. వీధిలో వున్న ఒకతను రాజుని గట్టిగా అడిగాడు.

"రాజా! నా గుఱ్ఱం తప్పిపోయింది. అదికానీ మీ పడకగది కప్పు మీద వుందేమో చూసి చెప్తారా?"

"నీకేమైనా పిచ్చా? గుఱ్ఱం నా పడకగది కప్పు ఎలా ఎక్కగలదు?" అడిగాడు రాజు కోపంగా.

"మీరు పూలపాన్పు మీద నిద్రిన్తూ, ఆత్మసాక్షాత్కారం పొందాలనుకుంటున్న రీతిలోనే." జవాబు చెప్పాడతను.

ఆ సమాధానంతో అబ్బురపడ్డ రాజు తేరిపార చూసి, అతను సంచార గురువని గుర్తించి వెళ్ళి ఆయన్ని సాదరంగా ఆహ్వానించాడు. ఆయన బోధనలతో రాజు త్వరలోనే వైరాగ్యాన్ని అలవరచుకుని ఆధ్యాత్మికంగా ప్రగతిని సాధించాడు.